సాక్షి వరంగల్

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



ఐహెచ్‌సీ సెషన్ చరిత్రాత్మకం

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ చరిత్రాత్మకమని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు.

- 8లో▸



అర్హులందరికీ ఆరు పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటీ పథకాలను అందజేస్తామని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

$31^0/17^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చలితోపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి సమయంలో పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మద్యం మత్తులో ట్రాక్టర్ డ్రైవర్ వీరంగం



వర్ధన్నపేట: మద్యం మత్తులో ఓ ట్రాక్టర్ డ్రైవర్ వీరంగం సృష్టించాడు. నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను నడిపి బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటన వర్ధన్నపేటలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేటలోని కొత్త బస్టాండ్ వద్ద అయ్యప్ప మాలధారుడు తన బైక్‌పై భార్య, కుమారుడితో కలిసి రోళ్లకల్‌కు వెళ్తున్నాడు. డ్రైవర్ ట్రాక్టర్ రొటవేటర్‌ను అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తూ అదుపు తప్పి బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్ నుంచి ముగ్గురు కిందపడి గాయపడ్డారు. వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగినట్లు గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



చెన్నారావుపేట: అధైర్యపడొద్దు.. అండగా ఉంటానని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చిరబోయిన యాకయ్య రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ఆయనను శనివారం బండా ప్రకాశ్ వద్దకు తీసుకెళ్లగా రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. అంతేకాకుండా ఎంజీఎం సూపరింటిండెంట్‌తో మాట్లాడి సమస్యను వివరించారు. ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. డయాలసిస్ కోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర నాయకులు సీరటి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, రామకృష్ణ, చిరంజీవి, రమేష్, ఈర్ల పెద్ద రమేష్, పెద్ద వీరస్వామి, పులి చేరాలు తదితరులు ఉన్నారు.

ముగ్గురికి కరోనా పాజిటివ్

గీసుకొండ: జిల్లాలో శనివారం మూడు కరోనా (జేఎన్1) పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. మొత్తం 81 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెలలో 8 పాజిటివ్ కేసులు నమోదు కాగా వారి పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి మరణాలు లేవని తెలిపారు. ప్రజలు సామాజిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని సూచించారు.

ప్రజల పక్షాన పోరాడాలి

రాయపర్తి: అధికారంలో లేకున్నా కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎంపీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం శక్తివంచనలేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, బందెల బాలరాజు, గారె నర్సయ్య, మాకినేని కృష్ణారావు, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

గీసుకొండ: ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి ఫార్మసిస్టుల సమస్యలను విన్నవిస్తామన్నారు. సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందకట్ల శరత్‌బాబు, ఫార్మసీ సూపర్‌వైజర్ వి.పద్మజాదేవి, వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.సత్యం, శ్రీదేవి, రూప్సీ, సతీష్, సృజన్, సుధారాణి, సరళారాణి, రమేష్, సూరయ్య పాల్గొన్నారు.

రంగులు మారిన రాజకీయం!

ఉమ్మడి వరంగల్‌లో ఈ ఏడాది రాజకీయంగా పెను మార్పులు చోటుచేసుకున్నాయి. 2023 కొందరికి తీపిని పంచగా, మరికొందరికి చేదును మిగిల్చింది. తెలంగాణ శాసనసభకు నవంబర్ 30న జరిగిన ఎన్నికల ఘట్టం అత్యంత కీలకంగా నిలిచింది. ఉమ్మడి వరంగల్‌లో 12 అసెంబ్లీ స్థానాలకు 11 స్థానాల్లో ఉన్న బీఆర్‌ఎస్.. ఈ ఎన్నికల్లో రెండు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఒక్క స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి 10 సీట్లలో విజయం సాధించింది. ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్కకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమశాఖ మంత్రి పదవి దక్కగా, కొండా సురేఖకు అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖలు దక్కాయి. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారు, పార్టీలు మార్చిన వారు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కాగా... కాకలుతీరిన రాజకీయ వేత్తలు ఓటమిని చవిచూశారు. బీజేపీ రాజకీయంగా బలపడినా.. ఎన్నికల వరకు వచ్చేసరికి ఓటమినే మూటగట్టుకుంది. బీఎస్పీ కూడా కొన్ని స్థానాల్లో పోటీ చేసి ఓడిపోగా.. సీపీఐ.. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. జిల్లాలో సీపీఐ, సీపీఎం, వామపక్షాలు ప్రజల పక్షాన ఉద్యమాలు చేశాయి.

ఊహించని ప్రజాతీర్పు.. జాతకాలు తారుమారు..

2023 ఏడాదిలో జిల్లాలో ఓటర్లు విలక్షణమైన తీర్పునిచ్చారు. దీంతో పలువురి జాతకాలు తారుమారు అయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 12 శాసనసభ స్థానాలకు కాంగ్రెస్ 10, బీఆర్‌ఎస్ రెండు స్థానాలను దక్కించుకున్నాయి. అలాగే.. జిల్లా నుంచి ఈసారి కొత్తగా ఏడుగురు ఎమ్మెల్యేలుగా శాసనసభలో అడుగు పెట్టగా.. మొదటిసారిగా జిల్లా నుంచి ముగ్గురు మహిళలకు అవకాశం దక్కింది. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సుమారు రెండు నెలల్లోనే ఆ పార్టీ నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ములుగు నియోజకవర్గం నుంచి ధనసరి సీతక్క, వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల, వర్ధన్నపేట, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, పాలకుర్తి నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, డాక్టర్ మురళీనాయక్, రామచంద్రునాయక్, దొంతి మాధవరెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి గెలుపొందారు. బీఆర్‌ఎస్ నుంచి కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ) విజయం సాధించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన వారిలో కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, డాక్టర్ మురళీనాయక్, రామచంద్రునాయక్, మామిడాల యశస్వినిరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు. బీజేపీ అభ్యర్థులు ఈసారి కూడా ఓటమి చెందారు. సీనియర్ రాజకీయ నాయకులుగా ఉన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, డీఎస్ రెడ్యానాయక్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు ఘోర పరాజయం పొందారు.

2023.. ఈ రోజుతో ఈ ఏడాది కాలగర్భంలో కలిసిపోనుంది. కాలచక్ర గమనంలో ఈ ఏడాది అంతర్ధానం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా పెనుమార్పులకు సజీవసాక్ష్యంగా నిలిచిన 2023లో ఉమ్మడి వరంగల్‌లో అనేక సంచలనాలు జరిగాయి. కొన్ని వర్గాలకు తీపి జ్ఞాపకాలు, మరికొన్ని వర్గాలకు చేదు ఘటనలను ఈఏడాది మిగిల్చింది. ఈ సంవత్సరం ఉమ్మడి వరంగల్ ప్రజలకు సమ్మిళిత ఫలితాలను అందించింది. రాజకీయంగా కొందరిని అందలమెక్కించి.. మరికొందరిని అధఃపాతాళానికి నెట్టేసి, రాజకీయరంగంలో పెను సంచలనాలకు సాక్షిగా ఈ ఏడాది అందరికీ గుర్తుండిపోతుంది.

- సాక్షిప్రతినిధి, వరంగల్



ఓరుగల్లును వేడెక్కించిన సార్వత్రిక ఎన్నికలు

- ఉమ్మడి జిల్లాకు క్యూ కట్టిన ప్రధాన పార్టీల అగ్రనేతలు
- రాతలు మార్చిన ప్రజాతీర్పు.. జాతకాలు తారుమారు..
- సీతక్కను వరించిన మంత్రి పదవి.. అమాత్యురాలిగా కొండా సురేఖ
- 10 సీట్లను గెలుచుకున్న కాంగ్రెస్.. రెండు స్థానాలకే బీఆర్‌ఎస్ పరిమితం
- శాసనసభలోకి తొలిసారిగా ఏడుగురు.. మొదటిసారిగా ముగ్గురు మహిళలు
- రాష్ట్రంలోనే విలక్షణ తీర్పు ఇచ్చిన ఓరుగల్లు ప్రజలు

ఓరుగల్లుకు క్యూ కట్టిన ప్రధాన పార్టీల అగ్రనేతలు..

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో 2023లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు జిల్లాలో వరుసగా పర్యటించారు. ముఖ్యంగా ఏడాది ద్వితీయార్థంలో జిల్లాలో జాతీయ నేతల తాకిడి బాగా ఉంది.

- ఆగస్టు నుంచి నవంబర్ వరకు ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతోపాటు జాతీయ, రాష్ట్ర నాయకులు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. ఆదివాసీలు అత్యధికంగా ఉండే జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు, రామప్ప దేవాలయం నుంచి అక్టోబర్ 19న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రామాంజపురంలో భారీ సభ నిర్వహించారు. నవంబర్ 2న కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి అంబట్‌పల్లిలో మహిళలతో సభ నిర్వహించి మహిళా డిక్లరేషన్ ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు టీపీసీసీ చీఫ్ హోదాలో 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర' నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేశారు. వీరితో కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నాయకులు జిల్లాలో పర్యటించారు.
- ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహబూబాబాద్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభలో పాల్గొన్నారు. అంతకు ముందు జూలైలో ఓరుగల్లులో పీఎం పర్యటించారు. కాజీపేట మండలం అయోధ్యపురంలో 160 ఎకరాల విస్తీర్ణంలో రూ.521 కోట్లతో చేపట్టిన వ్యాగన్ల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్ తదితరులు ప్రచారం చేశారు.
- బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అక్టోబర్ 16న జనగామ నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మొత్తం 12 నియోజకవర్గాలు కవరయ్యేలా ఆయన దశల వారీగా ఉమ్మడి జిల్లాలో పర్యటించి ప్రచారం చేశారు. జనగామలో కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య.. పార్టీని వీడి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు అభ్యర్థుల గెలుపును కోరుతూ విస్తృతంగా పర్యటించారు.

అభ్యర్థుల ఖర్చుల పరిశీలన

కరీమాబాద్: శాసన సభ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ఖర్చుల తుది నివేదికలను శనివారం జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్‌ప్రతాప్‌సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు విడుదల తర్వాత రోజు నుంచి 30 రోజుల్లోగా అంటే జనవరి 4 వరకు అభ్యర్థులు తుది ఖర్చుల వివరాలను అప్పగించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10 (ఏ) ప్రకారం అభ్యర్థులకు తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదని తెలిపారు. ఖర్చుల పరిశీలన తర్వాత ఈ నివేదికలను జిల్లా ఎన్నికల అధికారి స్క్రూటినీతో రాష్ట్ర ఎన్నికల కార్యాలయానికి పంపించనున్నట్లు వెల్లడించారు. నర్సంపేట నియోజకవర్గానికి సంబంధించి 15 మంది, వరంగల్ తూర్పు 26 మంది, వర్ధన్నపేట నుంచి 14 మంది అభ్యర్థులు నివేదికలు సమర్పించారని తెలిపారు. వరంగల్ తూర్పునకు సంబంధించిన ముగ్గురు అభ్యర్థులు లెక్కలు సమర్పించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి సంజీవ్‌రెడ్డి, సహాయ సహకార అధికారులు మానస, అకౌంటింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.



అభ్యర్థుల ఖర్చుల నివేదికలను పరిశీలిస్తున్న అమిత్‌ప్రతాప్‌సింగ్

పెండింగ్ చలాన్లు చెల్లించండి

- సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: వాహనదారులు గడువులోపు పెండింగ్ చలాన్లు చెల్లించి డబ్బు ఆదా చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించింది. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన రాయితీ పోస్టర్‌ను శనివారం ఆయన హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, డిస్ట్రిక్ట్ న్యాయ సేవా విభాగం చైర్మన్లు ఎం.కృష్ణమూర్తి, రాధాదేవి, హనుమకొండ, వరంగల్ జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ కార్యదర్శులు జె.ఉపేందర్ రావు, ఎం.సాయికుమార్‌తో కలిసి జిల్లా కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు, ఆటోలకు 80 శాతం, కార్లు, భారీ వాహనాలకు 60 శాతం, ఆర్టీసీ బస్సులకు 90 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే నెల 10లోగా చలాన్లను మీసేవ కేంద్రాలు, పేటీఎం, టీఎస్ ఆన్‌లైన్‌లలో చెల్లించాలని ఆయన సూచించారు. వాహనదారుల సౌకర్యార్థం హనుకొండ అదాలత్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, సీసీఆర్‌బీ ఏసీపీ కష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సుజాత, సీతారెడ్డి, వెంకన్న, సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తదితరులు పాల్గొన్నారు.



రాయితీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు, పక్కన సీపీ అంబర్ కిషోర్ ఝా

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

- వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: జాతీయ లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసులు సత్వరం పరిష్కారం అయ్యాయని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్లు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి అన్నారు. హనుమకొండలోని న్యాయ సేవా సదనం భవనంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. 52 సివిల్ కేసులు, 37 ఎంవీఓపీ (రూ.2,07,82,500), 6,255 క్రిమినల్ కేసులు, 32 బ్యాంకు పీఎల్సీ, 14 బీఎస్ఎన్ఎల్, 3,133 ఎలక్ట్రిసిటీ పీఎల్సీ (రూ.66,97,500) కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. వరంగల్‌లో ఐదు, నర్సంపేటలో ఒకటి, హనుమకొండలో 6, పరకాలలో ఒకటి బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. న్యాయమూర్తి వై.సత్యేంద్ర, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, జె.ఉపేందర్ రావు, సీఅంబర్ కిషోర్ ఝా పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి

నర్సంపేట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో..

నర్సంపేట రూరల్: నర్సంపేట మున్సిఫ్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌తో 85 కేసులు రాజీపడగా.. నేరం ఒప్పుకున్న 105 కేసుల్లో రూ.3,89,900 జరిమానా చెల్లించినట్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శిరీష తెలిపారు. అదేవిధంగా 27 బ్యాంకు కేసుల్లో రూ.8,08,636, నేరం ఒప్పుకున్న 2,121 పిట్టి కేసుల్లో రూ.2,87,540 జరిమానా చెల్లించినట్లు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, లోక్ అదాలత్ సభ్యులు మోటూరి రవి, సునీత పాల్గొన్నారు.

వేడుకలకు వేళాయె..

2023కు వీడ్కోలు.. 2024కు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

- వరంగల్ నగరంతోపాటు పట్టణాలు, గ్రామాల్లో ఉత్సవాలు
- డీజేలతో సందడి చేయడానికి సిద్ధమవుతున్న ప్రజలు

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంతోపాటు జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట పట్టణాలు, గ్రామాలు డిసెంబర్ 31 వేడుకలను చేసుకునేందుకు సిద్ధం అవుతున్నాయి. వరంగల్ నగరంలోని ప్రధాన హోటళ్లు, కన్వెన్షన్, ఫంక్షన్ హాళ్లు, ప్రముఖ విద్యాసంస్థలతోపాటు ప్రధాన రోడ్లపై 2023కి బైబై చెబుతూ.. 2024కు స్వాగతం పలికేలా ప్లాన్ చేసుకుంటున్నారు. గ్రామాల్లో డీజేలు ఏర్పాటు చేసుకొని కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు రెడీ అయ్యారు. పురుషులకు ఏమాత్రం తక్కువ కాకుండా మహిళలు కూడా వేడుకల్లో పాల్గొననున్నారు. ఇంకోవైపు చలి తీవ్రత ఉండడంతో మంటలు ఏర్పాటు చేసుకొని చలి కాచుకుంటూనే ఈఏడాదిలో జరిగినా తమ అనుభవాలను పంచుకోనున్నారు.

కుటుంబాలతో సందడి..

ఈసారి చాలా కుటుంబాలు థర్టీ ఫస్ట్ వేడుకలను ఒకేచోట చేసుకునేలా ప్లాన్ చేశాయి. ఆయా కుటుంబాలు పల్లెల్లో చిన్నాపాటి ఫంక్షన్ల మాదిరిగా జరుపుకోనున్నాయి. వీకెండ్ శనివారం కావడంతో చాలా మంది వేడుకల కోసం ఇళ్లకు చేరుకున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఇంకోవైపు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కావడం కూడా ఈసారి థర్టీ ఫస్ట్ వేడుకల్లో ఫ్యామిలీ సందడి పెరిగేలా చేసిందని చెప్పుకుంటున్నారు. ఈ ఏడాదిలో తమ కుటుంబాల్లో జరిగిన ఒడిదుడుకులను వివరిస్తూనే.. వాటిని అధిగమించేందుకు చేసిన ప్రయత్నాలను చెప్పుకుంటే కొంతవరకు వారు సమస్య నుంచి బయటపడే అవకాశం ఉంది. ఈ వేడుకలు చాలా కుటుంబాల్లో మార్పు తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇటు ఫ్యామిలీల సందడితోపాటు అటు స్నేహితుల కలయికతో కొత్త సంవత్సర వేడుకల్లో జోష్ ఎక్కువగా ఉండనుంది. 'గతేడాది వరకు పెద్దగా ఈ వేడుకలను పట్టించుకోలేదు.. మా కుటుంబంలో అందరి పెళ్లిళ్లు కావడంతో అటు అల్లుళ్లు, ఇటు బిడ్డలను ఇంటికి ఆహ్వానించాం.. ఇప్పటికే ఇంటి వద్ద కొడుకు, కోడలు ఉన్నారు.. అన్న, తమ్ముడి అల్లుళ్లు, బిడ్డలు కూడా రావాలన్నాం.. దీంతో ఈసారి థర్టీ ఫస్ట్ వేడుకలు ఫ్యామిలీ సందడి మధ్య నిర్వహించుకుంటున్నాం' అని రాయపర్తి మండలంలోని బంధనపల్లి గ్రామానికి చెందిన కిషన్‌రావు, యాదగిరి, శివాజీ తెలిపారు.



సంగెంలో 2024 ఆకారంలో కూర్చున్న పాఠశాల విద్యార్థులు

వరంగల్ రీజియన్‌కు స్లీపర్ కమ్ సీటర్ బస్సులు

హన్మకొండ: దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇకనుంచి బస్సుల్లో నిద్రిస్తూ వెళ్లే సౌకర్యం అందుబాటులోకి రానుంది. టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు 10 స్లీపర్, సీటర్ బస్సులు త్వరలో రానున్నాయి. ఇందులో 8 ఏసీ, రెండు నాన్ ఏసీ బస్సులున్నాయి. బెంగళూరుకు రోజు మూడు షెడ్యూల్స్ నడుస్తున్నాయి. ఈ మేరకు బెంగళూరుకు 6 ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులు, తిరుపతికి రెండు ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులు, హనుమకొండ, ఏటూరు నాగారం మీదుగా విశాఖపట్నానికి 2 నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సు నడిపేలా వరంగల్ రీజియన్ అధికారులు ప్రణాళిక రూపొందించారు. వీటితోపాటు త్వరలో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా వరంగల్ రీజియన్‌కు రానున్నాయని ఆర్‌ఎం జాస్తి శ్రీలత తెలిపారు.

అభయహస్తం దరఖాస్తుల విక్రేతపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ప్రజాపాలన కార్యక్రమంలో ఇస్తున్న అభయ హస్తం దరఖాసులు రూ.40కి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ గౌడ్ తెలిపారు. వరంగల్ పడమరకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సెంటర్ వద్ద ధర్మపూరి రవీందర్ అనే వ్యక్తి క్యూలైన్‌లో నిలబడి అధికారులనుంచి తన కుటుంబ సభ్యుల పేరు మీద దరఖాస్తు ఫారాలను తీసుకున్నాడు, సెంటర్‌కు వచ్చిన ప్రజలకు రవీందర్ రూ.40కి దరఖాస్తు ఫారాలు విక్రయిస్తుండగా అక్కడే ఉన్న కానిస్టేబుల్ కబీర్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడిని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేసే దరఖాస్తు ఫారాలను అక్రమంగా ఎవరైనా విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై పున్నం చందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన @ 88,291

- మూడో రోజూ భారీగా దరఖాస్తుల స్వీకరణ

కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సభలకు ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాలతోపాటు వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ పరిధిలోని 32 డివిజన్లలో శనివారం శనివారం 88,291 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గ బీఎన్‌రావు కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహిస్తున్న సెంటర్, 21వ డివిజన్ లోతుకుంట కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్న సెంటర్‌ను కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. కార్పొరేటర్ మహ్మద్ ఫుర్ఖాన్, వరంగల్ తూర్పు నోడల్ అధికారి కృష్ణారెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, ఇండస్ట్రీస్ జీఎం నరసింహమూర్తి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, వార్డు నోడల్ అధికారి సుష్మ, టీపీఓ బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరమ్‌సింగ్ పాల్గొన్నారు.



గీసుకొండ మండలం ఆరెపల్లిలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

మీటర్లు ఏర్పాటు చేసుకోవాలి : కలెక్టర్

గీసుకొండ: ఉచిత విద్యుత్ కోసం గిరిజన తండాలు, దళితవాడల్లో మీటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. అప్పుడే ప్రభుత్వం నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వర్తింస్తుందని పేర్కొన్నారు. మండలంలోని ఆరెపల్లి, దస్రు తండాలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఆమె దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి మాట్లాడారు. దస్రు తండాలో చాలా మంది విద్యుత్ మీటర్ల గురించి దరఖాస్తుల్లో వివరాలు నింపలేదు. అక్కడే ఉన్న మచ్చాపూర్ సబ్‌స్టేషన్ ఏఈ సంపత్‌రెడ్డిని కలెక్టర్ వివరణ కోరారు. ఎన్నిసార్లు చెప్పినా తండావాసులు మీటర్లు తీసుకోవడం లేదని ఏఈ చెప్పారు. దీంతో అవగాహన కల్పించి మీటర్లను ఏర్పాటు చేసుకునే విధంగా చేయాలని ఆదేశించారు. గ్రామ సభలతో సంబంధం లేకుండా ముందే దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఆర్డీఓ వాసుచంద్ర, మండల స్పెషల్ ఆఫీసర్ దేవేందర్, ఎంపీపీ భీమగాని సౌజన్య, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ వీరేశం, ఎంపీఓ ప్రభాకర్, డీటీ విజయలక్ష్మి, ఏఈ సుధాకర్, ఏఓ హరిప్రసాద్‌బాబు, ఏపీఎం సురేశ్‌కుమార్, సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్, వాడికారి జ్యోతి, కేలోత్ సరోజన, మక్కెన అశ్విని, పంచాయతీ కార్యదర్శులు సహజ, దినేష్, శ్రీధర్, చిత్తరంజన్, ఎలోజిన పాఠశాల ప్రిన్సిపాల్ రవికాంత్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసిన కలెక్టర్

దస్రుతండాకు వచ్చిన కలెక్టర్‌ను స్థానిక ఎలోహిం పాఠశాల విద్యార్థులు ముందస్తు న్యూఇయర్ వేడుకల్లో తమతో పాల్గొనాలని విన్నవించగా ఆమె సమ్మతించారు. వారితో కలిసి కేక్ కట్ చేసి ఉత్సాహాన్ని నింపారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో భర్తపై వేడి నీళ్లు పోసిన భార్య


కాలిన గాయాలతో యాకూనాయక్

తొర్రూరు రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తపై భార్య వేడి నీళ్లు పోసింది. ఈ ఘటన మండలంలోని కొమ్మనపల్లి శివారు భూక్యా తండాలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తండాకు చెందిన గుగులోత్ యాకూనాయక్ తరుచూ తన భార్య సరోజనతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం కూడా గొడవపడుతుండగా సరోజన ఆగ్రహం చెంది యాకునాయక్‌పై వేడి నీళ్లు పోసింది. దీంతో యాకూనాయక్ శరీరం కాలిపోవడంతో వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

చలి తీవ్రతతో వ్యక్తి మృతి


పంచనామా చేస్తున్న పోలీసులు

శాయంపేట : ఎవరూ చేరదీయకపోవడంతో అనాథలా తిరుగుతూ ఇళ్లలో భిక్షాటన చేసి జీవిస్తున్న వ్యక్తి శాయంపేట ప్రయాణ ప్రాగణంలో చలి తీవ్రతను తట్టుకోలేక మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. దామెర మండల కేంద్రానికి చెందిన తూముల స్వామి (60)కి వివాహం కాగా పిల్లలు కలుగక ముందే భార్య మృతి చెందింది. దీంతో ఒంటరిగా ఉన్న స్వామిని ఎవరూ పట్టించుకోకపోవడంతో గత కొన్ని రోజులు అత్తింటి గ్రామమైన పెద్దకోడెపాకలో శివాలయం వద్ద ఉంటూ ఎవరైనా తిండి పెడితే తింటూ ఉండేవాడు. 20 రోజుల క్రితం శాయంపేటకు చేరుకొని ప్రయాణ ప్రాగణంలో ఉంటూ భిక్షాటన చేస్తూ ఉంటున్నాడు. ఇటీవల కాలంలో విపరీతమైన చలి ఉండడం, అతని ఆరోగ్యం క్షీణించి ఉండడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెంది ఉన్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ కందగట్ల రవికి తెలియజేయడంతో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పంచనామా చేసి అతని బావ కొత్తపల్లి భిక్షపతికి సమాచారం అందించారు. అతనిని గుర్తించి అతని భౌతికకాయాన్ని తీసుకెళ్లి పెద్దకోడెపాకలో దహన సంస్కారాలు నిర్వహించారు.

ఐహెచ్‌సీ సెషన్ చరిత్రాత్మకం..


ఐహెచ్‌సీ ముగింపు సభలో మాట్లాడుతున్న వీసీ తాటికొండ రమేష్



మాట్లాడుతున్న ఐహెచ్‌సీ సెక్రటరీ ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి

వీసీ తాటికొండ రమేష్

- కేయూలో ముగిసిన సమావేశం
- పరిశోధన పత్రాల సమర్పణ
- పలు తీర్మానాలు

కేయూ క్యాంపస్ : ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ చరిత్రాత్మకమని వీసీ తాటికొండ రమేష్ అన్నారు. కేయూలో మూడు రోజుల నుంచి కొనసాగిన ఐహెచ్‌సీ సెషన్ శనివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. 1146 వరకు పరిశోధన పత్రాల సమర్పణ జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ చరిత్రకారులతోపాటు హిస్టరీ అధ్యాపకులు, పరిశోధకులు, యూనివర్సిటీల ఆచార్యులు, రిటైర్డ్ ఆచార్యులు ఐహెచ్‌సీ సెషన్‌లో పాల్గొన్నారు. క్యాంపస్‌లోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో యాన్సింట్, మిడ్యూవల్, మోడర్న్, అదర్‌థ్యాన్ కంట్రీ, సమకాలిన హిస్టరీ విభాగంలోనూ పరిశోధన పత్రాలు సమర్పించారు. ముగింపు సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్లోబల్‌పర్‌స్పెక్టివ్‌లో ఐహెచ్‌సీ పాత్ర గొప్పదన్నారు. చరిత్రపుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించే విషయమన్నారు. ఐహెచ్‌సీలో వివిధ దేశాలకు చెందిన వారు కూడా భాగస్వాములయ్యారని తెలిపారు. అకడమిక్ పరంగా వాస్తవిక చరిత్ర తెలియజేసేలా చరిత్రకారులు తమ పరిశోధన పత్రాలు సమర్పించారని చర్చలు జరిగాయన్నారు. ప్రసంగాల ద్వారా నూతన విజ్ఞానం పరస్పర ఆలోచనలకు మార్పిడులకు చోటుచేసుకుంటాయన్నారు. ఐహెచ్‌సీ నిర్వహణతో యావత్ భారతదేశం దృష్టి కాకతీయ విశ్వవిద్యాలయంపై పడిందన్నారు. 1993లో కేయూలో జరిగిన ఐహెచ్‌సీ సెషన్‌కు అప్పటి హిస్టరీ విభాగం అధిపతి ప్రొఫెసర్ దివంగత బొబ్బిలి లోకల్ సెక్రటరీగా వ్యవహరించారని గుర్తుచేశారు. క్యాంపస్‌లోని హిస్టరీ విభాగంలోని సెమినార్‌హాల్‌కు బొబ్బిలి స్మారక సెమినార్‌హాల్‌గా నామకరణం చేస్తున్నట్లు వీసీ ఈసందర్భంగా వెల్లడించారు. ఐహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్యముఖర్జీ మాట్లాడుతూ జాతీయ ఉద్యమకాలం 1935లోనే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ఏర్పాటైందన్నారు. లౌకిక ,శాస్త్రీయ దృక్పథంతో ఐహెచ్‌సీ ముందుకెళ్తుందన్నారు. తెలంగాణ ప్రాంతంలో కేయూలో మరోసారి మూడు దశాబ్దాల తరువాత మూడురోజులు నిర్వహించిన ఐహెచ్‌సీ 82వ సెషన్ విజయవంతమైందన్నారు. 1146 పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. ఐహెచ్‌సీ సెక్రటరీ ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి మాట్లాడుతూ అప్పటికి, ఇప్పటికి కేయూ చాలా అభివృద్ధి చెందిందన్నారు. ప్రొఫెసర్ కె.ఎం శ్రీమాలి, ప్రొఫెసర్, కేశవన్ వలుతాట్ మాట్లాడుతూ 1993లో కేయూలో ఐహెచ్‌సీ సెషన్‌ను నిర్వహించినప్పుడు క్యాంపస్‌లో ఎక్కడ చూసిన సమస్యలే కనిపించాయన్నారు. ప్రస్తుతం మూడు దశాబ్దాల తరువాత చూస్తే సైన్స్, ఆర్ట్స్, సోషల్‌సైన్స్ విభాగాల వారీగా అభివృద్ధి చెందాయన్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కేయూ హిస్టరీ విభాగం అధిపతి, ఐహెచ్‌సీ లోకల్‌సెక్రటరీ మనోహర్, ప్రొఫెసర్ జబీర్‌రాజా, ఓయూ హిస్టరీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటజనార్దన్ మాట్లాడారు.

ఐహెచ్‌సీ బిజినెస్ మీటింగ్

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో వివిధ సెషన్లలో పరిశోధన పత్రాల సమర్పణ అనంతరం మధ్యాహ్నం 3.30గంటలకు బిజినెస్ మీటింగ్ నిర్వహించారు. ఐహెచ్‌సీ సెక్రటరీ ప్రొఫెసర్ సయ్యద్‌అలీనమీద్ రిజావి కార్యదర్శి నివేదికను సమర్పించారు. 2022–2023 వార్షిక ఆర్థిక నివేదికను కోశాధికారి ప్రొఫెసర్ జబీర్‌రజా సమర్పించారు. ప్రెసిడెంట్ జనరల్ ఆదిత్య ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు. ఐహెచ్‌సీ బాధ్యులను వీసీ రమేష్ ,రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు సన్మానించారు.

ఐహెచ్‌సీ తీర్మానాలు..

కాకతీయ యూనివర్సిటీలో మూడు రోజులుగా నిర్వహించిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ ముగింపులో బిజినెస్ మీటింగ్‌లో పలు తీర్మానాలు ప్రకటించారు.

- నూతన జాతీయ విద్యావిధానంలో కేంద్రం.. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అసమగ్ర భారతీయ చారిత్రక విజన్‌ను ప్రవేశపెట్టబడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ముఖ్యంగా ఎకనామిక్ హిస్టరీ, ఉమెన్స్ హిస్టరీ, హిస్టరీ ఎన్విరాన్‌మెంట్ అనే అంశాలకు తక్కువ ప్రాధాన్యం ఇచ్చారని ఐహెచ్‌సీ తీర్మాణించింది. నూతన జాతీయ విద్యావిధానం పునరాలోచించాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది.
- భారతదేశంలోం 200 సంవత్సరాలకు చెందిన చారిత్రిక, పురాతన కళాఖండాలు, భవనాలను పరిరక్షించాలని, మతపరంగా పూజించబడే నిర్మాణాలను మార్చొద్దని, మార్చినా వాటిని పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది.
- ఆర్కియాలజికల్‌సర్వే ఆఫ్ ఇండియా చాలా కాలం నుంచి వార్షిక నివేదికలను, రెగ్యులర్ పబ్లికేషన్‌లు అయిన ప్రాచీన భారత పత్రిక, రిపోర్టులను, ఎపిక్ గ్రాఫిక్ జర్నల్స్ తిరిగి క్రమక్రమం తప్పకుండా ప్రచురించాలని ఐహెచ్‌సీలో తీర్మానం చేశారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ప్రచురణలు నిలిపివేయడం వల్ల చారిత్ర పరిశోధనలు వాస్తవిక చరిత్రకు సంబంధించిన అంశాలు మరుగునపడిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తూ తీర్మానించింది.
- ఢిల్లీలోని భారతీయ మ్యూజియాన్ని కేంద్ర ప్రభుత్వం విస్టార్ పేరిట వేరేచోటుకు తరలించాలని యత్నిస్తున్నారు. మ్యూజియం తరలించడాన్ని ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ఖండిస్తూ తీర్మానించింది. మ్యూజియాన్ని యథావిధిగా అక్కడే కొనసాగించాలని తీర్మానించింది.
- ఢిల్లీ నగరంలో ముఖ్యమైన వారసత్వ కట్టడాలు, భవనాలు కూల్చివేసేందుకు ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని, వాటిని యథావిధిగా కొనసాగించాలని తీర్మానించింది.
- గాజాపై ఇజ్రాయిల్ దాడులతో వేలాది మంది పౌరులు మృతి చెందారని, ఈ దాడులు ఖండిస్తూ తీర్మానింది. గాజాపై దాడులు నిలిపివేయాలని ఇజ్రాయిల్‌ను డిమాండ్ చేస్తూ ఐహెచ్‌సీ తీర్మానించింది.

ఐహెచ్‌సీ కార్యవర్గంలో కేయూ నుంచి ఇద్దరికి చోటు


మనోహర్


శ్రీనాథ్

కాకతీయ యూనివర్సిటీలో మూడు రోజులుగా నిర్వహించిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఐహెచ్‌సీ బిజినెస్ మీటింగ్‌లో వచ్చే ఏడాది డిసెంబర్ నుంచి ప్రాతినిధ్యం వహించే వచ్చే నూతన కమిటీని నియమించారు. ఐహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ గౌతమ్‌సేన్ నియమించారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లో నిర్వహించే ఐహెచ్‌సీ 83వ సెషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. కార్యవర్గ సభ్యులుగా కేయూ హిస్టరీ విభాగం అధిపతి, లోకల్‌సెక్రటరీగా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ టి మనోహర్‌ను, అలాగే ఇదే విభాగానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనాథ్‌ను నియమించినట్లు బిజినెస్ మీటింగ్‌లో ఐహెచ్‌సీ సెక్రటరీ ప్రొఫెసర్ సయ్యద్‌అలీ నమీద్ రిజావి ప్రకటించారు.

మావోయిస్టులు జనజీవనంలో కలవాలి

- ములుగు ఎస్పీ గాష్ ఆలం
- మావోయిస్టు నాగరాజు లొంగుబాటు


ఎస్పీ ఎదుట లొంగిపోయిన నాగరాజు

ములుగు: మావోయిస్టులు అడవి బాట వదిలి జనజీవన స్రవంతిలో కలిసి ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస పథకాలను వినియోగించుకుంటూ శాంతియుత జీవితం గడపాలని ములుగు ఎస్పీ గాష్ ఆలం అన్నారు. మావోయిస్టు పార్టీ వెంకటాపురం, వాజేడు ఏరియా కమిటీ సభ్యుడు పుల్లూరి నాగరాజు అలియాస్ జగత్ శనివారం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. ఈ సందర్భంగా తన కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ గాష్ ఆలం మాట్లాడారు. వాజేడు మండలం ప్రగళ్లపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి నాగరాజు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మెడికల్ అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో కొరియర్ సుధాకర్‌కు నాగరాజుతో పరిచయం ఏర్పడింది. అనంతరం సమస్యలు పరిష్కరిస్తామనే సాకుతో నాగరాజును వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీలో చేరడానికి మభ్యపెట్టగా అతడు మావోయిస్టు పార్టీలో చేరాడు. అయితే మావోయిస్టు నాయకులు తమ ప్రయోజనాల కోసం అమాయక ప్రజలను ఉపయోగించుకుంటున్నారని గ్రహించిన సుధాకర్.. పోలీసులకు లొంగిపోయాడని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ములుగు ఓఎస్‌డీ అశోక్ కుమార్, ఏటూరు నాగారం ఏఎస్పీ సంకీర్త్, ములుగు డీఎస్పీ రవీందర్ తదితరులు ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఎన్జీవోస్ కాలనీలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారి నుంచి రూ.9,630 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం హసన్‌పర్తికి చెందిన మాలోతు రమేష్, వడ్డేపల్లికి చెందిన కొమ్మరాజుల మల్లేష్, సప్తగిరి కాలనీకి చెందిన సూర నాగరాజును సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ వివరించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ బాబులాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి
- మరొకరికి గాయాలు

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు వరంగల్-ఖమ్మం హైవేపై శనివారం రాత్రి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం.. పెద్దనాగారం పరిధిలో ఇటుకబట్టీల వద్ద పని చేయడానికి వచ్చిన గుంజె ఆదినారాయణ(62), తన్నీరు కృష్ణలు పని నిమిత్తం పెద్దనాగారం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డుపై పంక్చర్ అయి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో మహబూబాబాద్‌కు తరలించారు. ఆస్పత్రికి వెళ్లగానే ఎన్‌టీఆర్ జిల్లాలోని కోడూరు గ్రామానికి చెందిన ఆదినారాయణ మృతి చెందగా ఖమ్మం జిల్లాకు చెందిన కృష్ణకు గాయాలయ్యాయి. విషయం తెలియగానే ఘటనా స్థలానికి ఎస్సై చేరుకొని పరిశీలించారు.

'మేడారం' ఉమ్మడి వరంగల్‌కు గర్వకారణం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హన్మకొండ : కోట్లాది మంది భక్తులు తరలివచ్చే మేడారం జాతర ఉమ్మడి వరంగల్‌లో జరగడం ఈ జిల్లాకే గర్వకారణమని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం సమ్మక్క, సారలక్క దర్శనానికి వెళ్తూ హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించే వనదేవతల జాతర కొంగుబంగారమన్నారు. ఈ పండుగను జాతీయ పండుగగా గుర్తిస్తే జిల్లా పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాజకీయాల్లో ఎగుడు దిగుడులుంటాయని, బీఆర్‌ఎస్ శ్రేణులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. సాధ్య కాని వాగ్దానాలు చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వెంకటేశ్వర్లు, యాదవ రెడ్డి, సుందర్ రాజు యాదవ్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌ఎస్ తాడ్వాయి : గంట కొడుతున్న ఎమ్మెల్సీ కవిత


హన్మకొండ : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

జాతరలో రావాణా సౌకర్యం మెరుగుపర్చాలి..

ఎస్‌ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మేడారంలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీలు మాలోత్ కవి, పసునూరి దయాకర్, ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌తో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ మేడారానికి జాతీయ హోదా కల్పిస్తే దేశ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. తెలంగాణ పేరు జాతీయ స్థాయిలో మార్మోగాలని, ఇందుకు బీఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేస్తామన్నారు. జాతరకు కోట్లాది మంది భక్తులు హాజరవుతారని, జాతరలో రావాణా సౌకర్యం మెరుగుపర్చాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులకు గత జాతరలో 3800 ఆర్టీసీ బస్సులు నడిపించామని, ఈసారి అదనపు సర్వీస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఏటా జాతరలో జాగృతి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టామని,ఈసారి కూడా చేపడుతామన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు, ఎంపీపీ వాణిశ్రీ, సర్పంచ్ బాబురావు, మండల అధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు.

గట్టమ్మ తల్లికి పూజలు

ములుగు రూరల్: మండలంలోని జాకారం పంచాయతీ పరిధి గట్టమ్మ తల్లికి ఎమ్మెల్సీ కవిత పూజలు నిర్వహించారు. శనివారం మేడారం సమ్మక్క–సారలమ్మల దర్శనానికి వెళ్తున్న ఆమె మార్గమధ్యలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి గట్టమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ములుగు ఎంపీపీ శ్రీదేవి సుధీర్ యాదవ్.. ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికారు.

అర్హులందరికీ ఆరు పథకాలు

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క


గొత్తికోయల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి సీతక్క

ఎస్‌ఎస్‌తాడ్వాయి: అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందజేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని కొండపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొండపర్తి గ్రామానికి త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో మొదటి సంతకం అంగన్‌వాడీ టీచర్ల జీతాల పెంపు ఫైల్‌పై చేశానన్నారు. త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. అంతకుముందు మంత్రి సీతక్క.. మొండ్యాలతోగు, జలగలంచ గొత్తికోయగూడెంలోని ఏర్పాటు చేసిన ప్రజాపాలనకు హాజరై ఆరు గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించి గొత్తికోయలతో మాట్లాడారు. గూడెంలోని పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతరం పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి.. జిల్లాకు వచ్చిన హెచ్‌డీఎఫ్ కంపెనీ, టాటా గ్రూప్ ప్రతినిధులకు గొత్తికోయల జీవన ప్రమాణాలు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ గాష్ ఆలం, మండల స్పెషలాఫీసర్ అప్పయ్య, బీడబ్ల్యూఓ ప్రేమలత, ఎంపీడీఓ సత్యాఅంజనేయప్రసాద్, ఎస్సై ఓంకార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి వద్ద రూ.3లక్షల విలువైన 12కిలోల ఎండు గంజాయిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పర్వతగిరి పోలీసులు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. శనివారం పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తి శంకర్‌అశోక్ పవార్ అరెస్టు చూపారు. ఈ సందర్భంగా సీఐ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులకు గంజాయి క్రయ, విక్రయ సమాచారం తెలపాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్సై వీరభద్రరావు, ఏఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.


అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డీఐఈఓ మాధవరావు, తదితరులు

- జిల్లా ఇంటర్ విద్యాధికారి మాధవరావు

సంగెం: ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు పొంది విద్యార్థులు, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వరంగల్ జిల్లా ఇంటర్ విద్యాధికారి మాధవరావు అన్నారు. సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీకాంత్‌రెడ్డి 32 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని స్వచ్ఛంద పదవి విరమణ సన్మానోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఐఈఓ మాట్లాడుతూ అధ్యాపక వృత్తి ఎంతో ఉత్తమమైందన్నారు. క్రమశిక్షణతో విద్యార్థులకు పుస్తకంలో ఉన్న పాఠాలకు సామాజిక, నైతిక అంశాలను జోడించి బోధించి ఉన్నతంగా తీర్చిదిద్ది సంతృప్తి చెందుతారన్నారు. సమయపాలన, క్రమశిక్షణకు మారుపేరుగా శ్రీకాంత్‌రెడ్డి విద్యాశాఖలో, సమాజంలో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. భావిజీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి, ఉమా దంపతులను గజమాల, పూలబొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రిన్సిపాళ్లు అశోక్‌రావు, నర్సింహారెడ్డి, ధరేంద్ర, శేషాచారి, అశోక్, శోభదేవి, సువర్ణ, కరుణశ్రీ, జయకుమారి, అధ్యాపకులు సునీల్‌రెడ్డి, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఆర్‌సీఓలు

కాటారం: భూపాలపల్లి జిల్లా కాటారంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకులాల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని నాలుగు గురుకులాల జోన్ల నుంచి 1200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నీస్, హాకి, క్యారం, చెస్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఆర్చరీ, బాక్సింగ్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఆయా విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడగా ఫైనల్స్‌లో పలు జట్లు పోటాపోటీగా తమ ప్రతిభను ప్రదర్శించాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓవర్ ఆల్ చాంపియన్‌గా జోన్–1 (ఆదిలాబాద్, ఆసిఫాబాద్, కామారెడ్డి, నిజామాబాద్), గేమ్స్ చాంపియన్ జోన్–2 (భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్)లు నిలిచాయి. పలు పాఠశాలల జట్లు క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన జట్లకు, క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్‌సీఓలు సంపత్‌కుమార్, ఆగస్టియన్, రంగనాథం, ప్రిన్సిపాల్స్ జేకే బుచ్చయ్య, ఇమామొద్దీన్, పీడీ శ్రీనివాస్, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.